Office Of The Advisor (Communications)
Govt. Of Andhra Pradesh

# పరిశ్రమలకు అత్యంత అనుకూలం

## మన విధానాన్ని భాగస్వామ్య సదస్సులో చాటుదాం

## అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశం

అమరావతి, ఫిబ్రవరి 15: ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చేవారికి రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా సత్వరం అనుమతులు ఇస్తున్న విధానాన్ని, మౌలిక వసతులు కల్పిస్తున్న తీరును ప్రపంచానికి తెలిసేలా విశాఖ భాగస్వామ్య సదస్సును సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. కియా కార్లు నుంచి ఫాక్స్‌కాన్ సెల్‌ఫోన్లు వరకు రాష్ట్రంలో తయారవుతున్న వివిధ ఉత్పత్తులను ఈసారి సదస్సులో ప్రదర్శించాలని చెప్పారు. ఈ 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు నిర్వహించే సీఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లపై గురువారం సచివాలయంలోని ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆటోమైబైల్, ఏరోస్పేస్, డిఫెన్స్ పరిశ్రమల నమూనా ప్రదర్శన ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. స్మార్ట్ పవర్ గ్రిడ్, ఎలక్ట్రిక్ వెహికిల్స్, డిజరప్టివ్ టెక్నాలజీ, సోలార్ స్టోరేజ్ రంగాలకు చెందిన వారిని సదస్సులో భాగస్వాముల్ని చేయాలని నిర్దేశించారు.

మన వంటలను, ఆహార పదార్థాలను, అరకు కాఫీని ప్రమోట్ చేసుకోవాల్సిన సమయం ఇదేనని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టం చేశారు. సదస్సుకు విచ్చేసే అతిథులకు నేచురల్ ఫార్మింగ్ ఫుడ్ అందించడం ద్వారా రాష్ట్రానికి బ్రాండ్ ఇమేజ్ తీసుకురావాలని చెప్పారు. 'పెట్టుబడి లేని సహజ వ్యవసాయం' గురించే దావోస్‌లో అంతా మాట్లాడారని, విశాఖ భాగస్వామ్య సదస్సు గురించి అలానే చెప్పుకోవాలని అన్నారు. మన కూచిపూడి నృత్యంతో ఆహుతులను ఆకట్టుకోవాలని చెప్పారు.

ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు చేతులమీదుగా సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభం కానుంది. మొత్తం జరిగే తొమ్మిది ప్లీనరీ సెషన్లకు కేంద్రమంత్రులు సురేష్ ప్రభు, ఎంజె అక్బర్, నితిన్ గడ్కరీ, అశోక్ గజపతిరాజు, వైఎస్ చౌదరి, ధర్మేంద్ర ప్రదాన్, హర్షవర్ధన్, రవిశంకర్ ప్రసాద్, విజయ్ గోఖలే, మనోజ్ సిన్హా, నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ అజయ్ కుమార్, నీతి ఆయోగ్ సీఈవో అమితాబ్

ఖాన్, సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ హాజరుకానున్నారు. అలాగే బంగ్లాదేశ్, కెనడా, జపాన్, జోర్డాన్, మయన్మార్, మారిషస్, మొరాకో, సింగపూర్, శ్రీలంక, టాంజానియా, థాయిల్యాండ్, యూఏఈ, జాంబియా దేశాలకు చెందిన మంత్రులు పాల్గొంటారు. 36 దేశాలకు చెందిన పారిశ్రామిక, వాణిజ్య ప్రముఖులు సదస్సుకు హాజరవుతారని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు.

ఫిబ్రవరి 24వ తేదీ ఉదయం 10 గంటల నుంచి భాగస్వామ్య సదస్సులో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభంకానుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు 'చార్టింగ్ ఇండియాస్ గ్లోబల్ ఇంటిగ్రేషన్ స్ట్రాటజీ' అంశంపై ప్రారంభ సదస్సు జరుగుతుంది. సాయంత్రం 4.45 గంటలకు 'సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్' పేరుతో ప్లీనరీ సెషన్-1 నిర్వహిస్తుండగా, ఈ సెషన్‌లో మంత్రి నారా లోకేష్ ప్రారంభోపన్యాసం చేస్తారు. దీనికి ప్యానలిస్టులుగా ఏడీబీ కంట్రీ డైరెక్టర్ కెనిచి యొకోయామా, కియా మోటర్స్ ప్రెసిడెంట్ కుక్ హున్ షిమ్ వ్యవహరిస్తారు.

చివరి రోజు కార్యక్రమానికి సింగపూర్ మంత్రి ఎస్ ఈశ్వరన్, యూకే హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు బారోనెస్ సందీప్ వర్మ అతిధిగా రానున్నారు. అదే రోజు జరిగే స్పెషల్ ప్లీనరీలో ప్యానలిస్టుగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు పండిట్ రవిశంకర్ పాల్గొంటారు.

విశాఖ భాగస్వామ్య సదస్సులో ఆటోమొబైల్, టూరిజం, ఏరోస్పేస్-డిఫెన్స్, టెక్స్‌టైల్స్, పునరుత్పాదక విద్యుత్, ఫుడ్ ప్రాసెసింగ్, వైద్య పరికరాలు, ఎలక్ట్రానిక్స్ రంగాలపై సెషన్లు నిర్వహించడంతో పాటు కొరియా, జపాన్ దేశాల కోసం ప్రత్యేక సెషన్లు వున్నాయి. ఈసారి సెషన్ల నిర్వహణకు మొత్తం మూడు హాళ్లు సిద్ధం చేస్తుండగా, ఇందుకు సంబంధించి ఆకృతులను ముఖ్యమంత్రి పరిశీలించారు.